పల్లెల్లో నిలిచిన అభివృద్ధి

- జీపీ భవన నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడో?
- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- మళ్లీ ఎన్నికల నాటికీ కష్టమే..



చింతలతండాలో పిల్లర్ల దశలో నిలిచిన పంచాయతీ భవన నిర్మాణం

జూలూరుపాడు: మూడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలు లేని జీపీలకు నూతన భవన నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేసింది. ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎస్టీఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. కొత్తూరు, గుండ్లరేవు, భోజ్యాతండా, సురారం, శంభునిగూడెం, గాంధీనగర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలకు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు, నల్లబండబోడు, చింతలతండా, సాయిరాంతండా, వెంగన్నపాలెం, గురువాగుతండా జీపీ భవనాలకు ఎస్టీఎస్‌డీఎఫ్(ఐటీడీఏ) నిధులు కేటాయించారు. రెండున్నరేళ్ల క్రితం ఆయా నిర్మాణ పనులు చేపట్టారు కానీ, పనులు నత్తనడకన నడుస్తున్నాయి.

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖ, ఐటీడీఏ పనులకు సంబంధితశాఖ ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఏడేళ్ల క్రితం నూతనంగా ఏర్పడిన గ్రామ పంచాయతీలు ఇంకా అద్దె భవనాల్లోనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గతంలో మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2018లో మరో 12 గ్రామ పంచాయతీలను నూతనంగా ఏర్పాటు చేయడంతో మొత్తం 24 గ్రామ పంచాయతీలు అయ్యాయి. 13 గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉండగా.. మిగిలినవి అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్నాయి. దీంతో కనీస సౌకర్యాలు లేక పాలకవర్గాలు, ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తూరు, గుండ్లరేవు, నల్లబండబోడు, శంభునిగూడెం, సురారం, చింతలతండా, నల్లబండబోడు, భోజ్యాతండా, గాంధీనగర్, సాయిరాంతండా, వెంగన్నపాలెం జీపీలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో నడుస్తున్నాయి. గుండ్లరేవు, కొత్తూరు, సురారం గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాలు పూర్తి కావడంతో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. శంభునిగూడెం, నల్లబండబోడులో స్లాబ్ పూర్తి కాగా, చింతలతండాలో పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోయి. చింతలతండాలో ఫారెస్ట్ క్లియరెన్స్ లేకపోవడంతో భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. భోజ్యాతండా, గాంధీనగర్, సాయిరాంతండా, వెంగన్నపాలెం, గురువాగుతండాలలో స్థలం లేకపోవడంతో జీపీ భవనాల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. స్థలాలు, పలు రకాల సమస్యలు, కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం, సర్పంచ్‌లు కూడా లేకపోవడంతో జీపీ భవనాల గురించి పట్టించుకునేవారే లేరు. జీపీ భవన నిర్మాణాలు ప్రారంభమైన చోట సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎప్పటికీ పూర్తి అవుతాయో తెలియని పరిస్థితి. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి 14 నెలలు అవుతున్నా ఎన్నికల జరగకపోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడింది. గ్రామ పంచాయతీ ఎన్నికల జరిగే నాటికైనా జీపీ భవనాల నిర్మాణాలు పూర్తి అయితే నూతన పాలకవర్గాల కొలువుదీరే అవకాశం ఉంటుంది.

మూడు జీపీ భవనాలు పూర్తి...



కొత్తూరు, గుండ్లరేవు, సురారం జీపీ భవనాల పనులు పూర్తి కాగా, శంభునిగూడెం, నల్లబండబోడులలో స్లాబ్ పూర్తయింది. చింతలతండాలో పిల్లర్ల స్థాయిలో ఉంది. ఐదు చోట్ల స్థల సమస్య కారణంగా పనులు ప్రారంభం కాలేదు. అన్నిచోట్ల జీపీ భవన నిర్మాణాలు ప్రారంభమయ్యేలా ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

– తోట తులసీరామ్, ఎంపీఓ, జూలూరుపాడు

క్లుప్తంగా

ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీ ఎన్నిక

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా బీసీ ఓబీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన బ్రాంచి కమిటీ ఎన్నిక బుధవారం ఇల్లెందులో జరిగింది. ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడిగా పి.పూర్ణచందర్ (ఎస్‌ఓఎం/జీకేఓసీ), ఏరియా కార్యదర్శిగా బీకే సాంబయ్య (సీనియర్ సెక్యూరిటీ గార్డు), పి.పవన్‌కుమార్, ఏజీ శివప్రసాద్, అన్వర్, బ్రాంచి సెక్రెటరీ గుగ్గిళ్ల యాదగిరి, లాలా కృష్ణ (జాయింట్ సెక్రెటరీ), సీహెచ్ రామలింగేశ్వరరావు (ఆర్గనైజింగ్ సెక్రెటరీ), పీ.మాధవరావు (చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ), సదనాల శ్రీనివాస్ (కోశాధికారి)ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీ రమేష్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

పాల్వంచ: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల సమస్యలపై పలు సంఘాల నాయకులు మంగళవారం రాత్రి కేటీపీఎస్‌కు వచ్చిన జెన్‌కో సీఎండీ సందీప్ కుమార్ సుల్తానియాకు వినతిపత్రాలు సమర్పించారు. పదోన్నతులు పొందిన ఏడీఈలకు బదిలీ చేయాలని, రిటైర్మెంట్ ఇంజనీర్ల స్థానంలో పోస్టులను భర్తీ చేయాలని, పాల్వంచ కేంద్రంగా మరో రెండు 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ కర్మాగారాలను నిర్మించాలని, మెడికల్ ఇన్సూరెన్స్ రూ.30 లక్షలకు పెంచాలని, రిటైర్మెంట్ వయస్సు తగ్గించాలని కోరారు. సీఎండిని కలిసిన వారిలో టీఈపీఈఏ బ్రాంచ్ సెక్రటరీ, టీఈఈఏ బ్రాంచ్ సెక్రటరీ ఎండీ.సమీర్, జాదవ్ తదితరులు ఉన్నారు. అదేవిధంగా కేటీపీఎస్ 6వ దశ నిర్మాణంలో పనిచేసిన అర్హులైన కార్మికులను ఆర్టిజన్లుగా తీసుకోవాలని, ఈ విషయంపై గతంలో యాజమాన్యం హామీ ఇచ్చిందని తెలిపారు.

తడిసిన పంటలను కొనుగోలు చేయాలి

ఇల్లెందురూరల్: అకాల వర్షాంతో తడిసిన పంటలను మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా తుపాకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న మక్కలు నీటిలో తడిసి రంగు మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యతను కోల్పోయే పరిస్థితులు ఉన్నాయని, తడిసిన అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వాంకుడోత్ మోతీలాల్, మూడు మాలు, జోగ కృష్ణ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

జూలూరుపాడు: మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడు సొసైటీ చైర్మన్ చీమలపాటి భిక్షం, ఏఓ దీపక్ ఆనంద్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, వై.గోపాల్‌రావు, ధర్మా, బాలు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వితరణ

టేకులపల్లి: రామచంద్రునిపేట పంచాయతీ పాతర్లగడ్డ అంగన్‌వాడీ కేంద్రానికి మండల యూత్ కాంగ్రెస్ నాయకులు బుధవారం సీలింగ్ ఫ్యాన్ వితరణ చేశారు. కార్యక్రమంలో చిలువేరు చంద్రశేఖర్, భూక్యా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కొప్పురాయి పంచాయతీ లక్ష్మీపురం యూత్‌కి లక్ష్మీపురం, ఒడ్డుగూడెం ఉపాధ్యాయులు పూనెం నాగేశ్వరరావు, నరసింహారావు, వాంకుడోత్ హత్తీరామ్, తులసీరామ్, రవి, రాజు, రాజశేఖర్ క్రికెట్ బ్యాట్లు వితరణగా అందజేశారు.

జూలూరుపాడు: పాపకొల్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పూర్వ విద్యార్థిని బొమ్మలాట జ్యోతి తన తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొమ్మలాట శేషయ్య జ్ఞాపకార్థం ఇనుప బీరువాను బుధవారం వితరణ చేశారు. ఇదే పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు శేషయ్య విధులు నిర్వర్తించడం, అతని కుమార్తె జ్యోతి ఇక్కడే చదువుకొని ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయురాలుగా పని చేస్తోంది. జ్యోతి, తన సోదరుడు ప్రభాకర్‌తో కలిసి హెచ్‌ఎం సంపూర్ణజ్యోతికి బీరువా అందజేశారు.

దాడులు నిలిపివేయాలి

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలపై సాగిస్తున్న దమన కాండను నిలిపి వేయాలని, అడవులను రక్షించాలని ఎన్డీ చంద్రన్న వర్గం ఇఫ్టూ జిల్లా కార్యదర్శి బి.రాంసింగ్ కోరారు. బుధవారం ఇల్లెందులో జరిగిన పోస్టర్ల ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20న మహబూబాబాద్‌లో 25న భద్రాద్రి కొత్తగూడెంలో జరగనున్న జిల్లా స్థాయి సదస్సులను విజయవంతం చేయాలని కోరారు.

నేడు చెక్కుల పంపిణీ

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేతుల మీదుగా గురువారం ఉదయం 9 గంటలకు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ నాయకుడు సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీఓ అరుణకుమారి

ఇల్లెందురూరల్: పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ ఇల్లెందు ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి అన్నారు. తిలక్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ పాఠశాలల్లో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా బరువులు చూడటం ద్వారా పోషకాహార లోపం కలిగి ఉన్న గర్భిణులు, బాలింతలు, యుక్త వయస్సు పిల్లలను గుర్తించాలని, వారు బలంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు సూచించారు. సూపర్‌వైజర్ కొమరమ్మ, పోషణ అబియాన్ ఇందు, కార్యదర్శి సమ్మయ్య, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్‌కు టెండర్లు

ఇల్లెందు: జగదాంబా సెంటర్ లలిత కళామందిర్ రోడ్డులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ కిరాయిలకు ఇచ్చేందుకు టెండర్ పిలిచారు.

బుధవారం ప్రకటించిన 16 గదుల్లో 14 గదులకు టెండర్ ద్వారా ఖరారు చేస్తున్నట్లు కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఇందులో 1, 2 షాపులు ఎస్సీ, 3 ఎస్టీ, 4 వికలాంగులు, 5, 6 స్వయం సహాక సంఘాలకు, 7వ షాపు నాయీబ్రాహ్మణ, రజక సభ్యులకు కేటాయించారు. ఇక 8, 9, 11, 12, 14, 15, 16 షాపులు బహిరంగ వేలం ద్వారా ఖరారు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో షాపు రూ.3407 నెలసరి కిరాయి చెల్లించాలని ఈ నెల 11 లోపు దరఖాస్తులు అందజేయాలని, 15న జరుగు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి..



సింగరేణి సీఎండీ బలరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్‌కు కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, ఎంఎల్‌సీ కోదండరామ్, కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ నాయకులు కలిసి కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలకు సంవత్సరాల తరబడి అన్యాయం జరుగుతోందని, దీనిని సరిచేయాలన్నారు. వారి వేతనాలతోపాటు వైద్య సదుపాయం, సెలవులు, క్యాంటిన్ తదితర చట్టబద్ధ సౌకర్యాలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన సీఎండీ సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందని, వారి జీతాలను పెంచటానికి సింగరేణి యాజమాన్యం కూడ సిద్ధం ఉందన్నారు. ప్రస్తుతం జీఓ ప్రకారం వేతనాన్ని చెల్లిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఇచ్చిన వెంటనే పెంచిన వేతనాన్ని చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, టీజేఎస్ నాయకులు వి.బాబు, మల్లెల రామనాథం తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రమేష్

జూలూరుపాడు: రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ అన్నారు. బుధవారం జూలూరుపాడులో జరిగిన బీజేపీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. ఈనెల 11న కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో బీజేపీ కిసాన్ మోర్చా బృందం పర్యటిస్తుందన్నారు. రేషన్ దుకాణాల్లో పంపిణీ చేసే సన్న బియ్యం కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. లబ్ధిదారునికి బియ్యం 5 కిలోలు కేంద్రం, ఒక కిలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోందని, దీన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తామే అమలు చేస్తున్నట్లు గొప్పలు చెబుతోందన్నారు. కార్యక్రమంలో సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, భూక్యా రమేష్, సిరిపురపు పుల్లారావు పాల్గొన్నారు.

ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీపై హర్షం



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కాకతీయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మైనింగ్‌ను ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం 300 ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటుకు జీఓ జారీ చేయడంలో విశేష కృషి చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యర్రా కామేష్ ధన్యవాదాలు తెలిపారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాకు మంజూరు కావడం హర్షణీయమన్నారు. గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరు నాయక్, నాగుల రవికుమార్, రాయరాకుల శివ శంకర్, పూనెం మురళి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిలిపివేయాలి

ఇల్లెందు: ఏజెన్సీ ప్రాంతంలో వివిధ గ్రామపంచాయతీల నుంచి పెసా కమిటీలను నిర్వీర్యం చేస్తూ వలస ఆదివాసీలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని తక్షణం వాటిని నిలిపివేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి సనప విష్ణు డిమాండ్ చేశారు. బుధవారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ నేతలే ఇందిరమ్మ ఇళ్ల కమిటీలుగా మారారని తెలిపారు. ఆదివాసీ చట్టాలు అమలు చేయటం లేదన్నారు. ఈ సమావేశంలో చింత ఉపేందర్, సనప గోవర్ధన్, కిషోర్, రామచంద్రు, రాకేష్, మధు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ ఫంక్షన్ హాల్‌లో సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బుధవారం ఉచితంగా కంటి పరీక్షల శిబిరం ఏర్పాటు చేశారు. శరత్ మాక్సివిజన్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో పోలీస్ అధికారులు, సిబ్బందికి ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ తెలిపారు. ప్రతీ మనిషికి శరీరంలోని అన్ని అవయవాలలో కళ్లు చాలా ప్రధానమైనన్నారు. ఈ శిబిరంలో 300 మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్, టూటౌన్ సీఐ రమేష్, త్రీటౌన్ సీఐ శివప్రసాద్, జూలూరుపాడు సీఐ ఇంద్రాసేనారెడ్డి, ఆర్‌ఐలు సుధాకర్, కృష్ణారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుశాఖలో సేవలు వెలకట్టలేనివి..

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీసు ఆఫీసర్స్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీను పోలీసుశాఖలో అందించిన సేవలు వెలకట్టలేనివని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎస్‌ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. అనంతరం చిరంగి శ్రీనివాస్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, రుక్మాంగధర్ బండారి, దిండిగల రాజేందర్, గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, సత్యనారాయణ, కందుకూరి గణేష్, రాజు, మేకల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు తేదీని ఈ నెల 15 వరకు పొడిగించడం జరిగిందని, అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్ పాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, డిగ్రీ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు.

'ఇస్రో'పై వ్యాసరచన పోటీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇస్రో ప్రస్థానం 1975 ఏప్రిల్ 19న అంతరిక్షంలోకి మొదటి సారిగా ప్రవేశపెట్టిబడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న సందర్భంలో సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శారద, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియాలో 2025 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ఉచితంగా పాలిసెట్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఇల్లెందు సింగరేణి కాలరీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 10వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనిగంటలు మార్చాలి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలో బుధవారం నుంచి పనిగంటల్లో మార్పు చేసిన యాజమాన్యం కొత్తగూడెం ఏరియాలో మార్పు చేయటం మర్చిపోయిందని కాంట్రాక్ట్ కార్మికులు వాపోతున్నారు. నేటి వరకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయకపోవటం గర్హనీయమన్నారు. ఇప్పటికైనా ఏరియా సివిల్ అధికారులు కాంట్రాక్ట్ కార్మికులకు పనిగంటలు మార్పుచేయాలని పలువురు కాంట్రాక్ట్ కార్మికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ హేమచంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బర్మా, బాబు క్యాంప్, బర్లీ ఫిట్, సన్యాసి, మధుర బస్తీ, బస్టాండ్, రామా టాకీస్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రాజేశ్వరరావుకు నివాళి

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశంలో భూపోరాటాలకు శ్రీకారం చుట్టి నిరుపేదల జీవనోపాధి కల్పించిన చంద్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్ర రాజేశ్వరరావు 31వ వర్ధంతిని స్థానిక శేషగిరిభవన్‌లో బుధవారం నిర్వహించారు. చంద్ర చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎస్‌కే సాబీర్‌పాషా, జమలయ్య పాల్గొన్నారు.

ఇల్లెందు: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు నిర్మాతల్లో ఒక్కరైన చంద్ర రాజేశ్వరరావు త్యాగం అజరామరం అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కె.సారయ్య అన్నారు. బుధవారం చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. డి.శంకర్, బంధం నాగయ్య, బాస శ్రీనివాస్, కొమురయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): నిరుద్యోగ దివ్యాంగ యువతీ, యువకులకు సమర్థనం దివ్యాంగుల సంస్థ– హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఐటీఈఎస్ (కంప్యూటర్, బీపీఓ) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ నల్లపు శ్రవణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత భోజనం, వసతి, ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని పేర్కొన్నారు. 10వ తరగతి పాసైనవారు ఏప్రిల్ 15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 6364867804 నంబర్‌లో సంప్రదించాలని వివరించారు.

రేగా జన్మదిన వేడుకలు

ఇల్లెందు: బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు బుధవారం ఇల్లెందులో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. దిండిగల రాజేందర్, సిలివేరు సత్యనారాయణ, భాష్‌సింగ్, ఎస్.రంగనాథ్, ధనలక్ష్మి, పరుచూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి



జూలూరుపాడు: ఖాళీ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

ఇల్లెందురూరల్: పేద మధ్య తరగతి ప్రజలపై భారం పెరిగేలా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు కొనసాగుతున్నాయని సీపీఎం నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు విమర్శించారు. వంట గ్యాస్ పెంపును నిరసిస్తూ మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో ఇల్లెందు – మహబూబాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వజ్జ సురేష్, వీరభద్రం, వెంకన్న, సంతోష్, కోటమ్మ, మంగ, భవాని తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా నాయకుడు గుగులోత్ రాంచందర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మాట్లాడుతూ.. అధికారం చేపట్టిననాటి నుంచి ధరలు అమాంతం పెంచుకుంటూ పోతున్న కేంద్ర ప్రభుత్వానికి దేశ ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

జూలూరుపాడు: వంట గ్యాస్, చమురు ధరల పెంపును వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జూలూరుపాడులో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్ కృష్ణ, బానోత్ ధర్మా, వై.గోపాల్‌రావు, రాయల సిద్ధు, తోటకూరి నరేష్, లింగాల వీరభద్రం, ఇరప రాజు, కల్తి నాగేశ్వరరావు, ధనమ్మ, రమాదేవి, సాగర్, రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలతో సతమతం..

కనీస సౌకర్యాలకు నోచుకోని చింతోనిచెలక పెద్దతండా ప్రజలు



గ్రామంలో డ్రెయినేజీ లేక మురుగునీటి దుస్థితి

టేకులపల్లి: టేకులపల్లి మండలం చింతోనిచెలక గ్రామ పంచాయతీ పెద్దతండా వాసులు సమస్యలతో సతమతం అవుతున్నారు. తండాలో మొత్తం 70 నివాసాలు ఉండగా 226 మంది జనాభా. ఐదు వీధులు ఉంటే కేవలం మూడు వీధుల్లో మాత్రమే సీసీ రోడ్లు వేశారు. మిగిలిన రెండు వీధుల్లో సీసీ రోడ్లు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. డీపీ మోటారు పని చేయడం లేదు. చేతి బోరు నీరే ఆధారం. మిషన్ భగీరథ నీటికి తండా వాసులు నోచుకోలేదు. చేతి బోరు చెడిపోతే ఇక అష్టకష్టాలే. పక్కా డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైనే నిల్వ ఉంటుంది. బోరు వద్ద ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టకపోవడంతో బోరు పక్కనే మురుగు పేరుకుపోతోంది. తండాలో ప్రభుత్వ పాఠశాల లేదు. అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనంతో ఉంది. 12 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. బాలింత ఒకరు, గర్భిణి ఒకరు సేవలు పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి అసౌకర్యంగా, ఇరుకైన దారి ఉండటంతో కేంద్రానికి సరఫరా చేసే సామగ్రి వాహనం కేంద్రం లోపలి వరకు వెళ్లలేని పరిస్థితి. తండా ఏర్పడి దశాబ్దాలు దాటుతున్నా పక్కా రోడ్లు, డ్రెయినేజీ, మిషన్ భగీరథ నీటి సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయని, ఈ ఎండాకాలం నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు స్పందించి తండాలో సమస్యలు పరిష్కరించాలని తండావాసులు కోరుతున్నారు.



గోడు వెళ్ల బోసుకుంటున్న చింతోనిచెలక పెద్దతండా వాసులు

నీటి ఎద్దడిని నివారించాలి..



గ్రామంలో మొత్తం 70 నివాసాలు ఉన్నాయి. 226 మంది నివసిస్తున్నాము. చేతి బోరు ఒక్కటే ఆధారంగా ఉంది. మిషన్ భగీరథ నీటి సదుపాయం లేదు. అధికారులు స్పందించి చేతి బోర్లు వేయించాలి. మిషన్ భగీరథ నీటి సదుపాయం కల్పించి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి. అర్హులైన అందరికీ రైతు భరోసా ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. – బాణోతు లక్ష్మి

రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి..



తండాలో మొత్తం ఐదు వీధులు ఉన్నాయి. మూడు వీధుల్లో మాత్రమే సీసీ రోడ్లు వేశారు. పక్కా రోడ్లు లేకపోవడం వల్ల వర్షాకాలంలో నానా తంటాలు పడాల్సి వస్తోంది. తండాలో డ్రెయినేజీలు కూడా లేవు. ఇళ్ల నుంచి వచ్చే మురుగు రోడ్డు పక్కనే నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. బోరు వద్ద ఇంకుడు గుంత నిర్మించాలి. ఊరంతా పక్కా డ్రెయినేజీలు నిర్మించాలి. – సునావత్ శ్రీను